సమస్యల పరిష్కారానికే సర్వే

భూ వివరాలు నమోదు చేస్తున్న జిల్లా భూ కొలతల అధికారి సోమేశ్వర్

- జిల్లా భూ కొలతల అధికారి సోమేశ్వర్
- మండల కేంద్రంలో ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే

పెంచికల్‌పేట్, జనవరి 23 : రెవిన్యూ, ఫారెస్ట్ భూ సమస్యలను పరిష్కరించేందుకే సంయుక్త సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా భూ కొలతల అధికారి సోమేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని కాగజ్ నగర్–పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి హనుమాన్ విగ్రహం వెన కాల గల ఫారెస్ట్ కార్యాలయం నుంచి పెంచి కల్ పేట్– బెజ్జూర్ ప్రధాన రహదారి లోడ్పల్లి బొక్కి వాగు వంతెన వరకు మంగళవారం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ.. పూర్వ రికార్డులు, నక్ష, జీపీఎస్ లోకేషన్ పరిశీలించామన్నారు. 90 శాతం ఇక్కడ నెలకొన్న భూ సమస్యలపై ఒక అవగాహన వచ్చిందని, పూర్తి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. త్వరలోనే రెవిన్యూ, ఫారెస్ట్ హద్దులు ఏర్పాటు చేసి, పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. మరోవైపు పంట పొలాల్లో అధికారులు సర్వే చేయడంపై రైతులు అయోమయానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ గోపాల్, ఎంసీలు రామకృష్ణ, శ్రీనివాస్, ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుధాకర్, రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూ

- బెల్లంపల్లి పర్సనల్ మేనేజర్ తిరుపతి

జీఎం కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతి

రెబ్బెన, జనవరి 23 : సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకం కింద ఇంటర్వ్యూ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం ఇద్దరు కారుణ్య నియమకం కోసం, మరో ఇద్దరు ఏక మొత్తం డబ్బులు చెల్లింపు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అభ్యర్థులకు, వారి కుటుంబ సభ్యులకు పర్సనల్ విభాగం అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రతి ఒక్కరినీ వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, సంబంధిత పత్రాలను పరిశీలించారు. సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్‌పై వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం నాగుల వేణు, జూనియర్ అసిస్టెంట్లు బాబా, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు

రెబ్బెన : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

నేతాజీ స్ఫూర్తితో ముందుకుసాగాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/ రెబ్బెన/బెజ్జూర్/వాంకిడి/కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, జనవరి 23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావ్‌తో కలిసి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, ఎంపీడీవో శశికళ, సర్పంచ్ బాపురావు, మాజీ ఎంపీటీసీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. రెబ్బెన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ వేమూర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, ఎంపీటీసీ పెసరి మధునయ్య, ఉపసర్పంచ్ మడ్డి శ్రీనివాసగౌడ్ నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చరణ్‌దాస్, ప్రభాకర్, శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, మాజీ ఎంపీటీసీ బొంగు నర్సింగరావు, వార్డు సభ్యుడు గోగర్ల రాజేశ్, నాయకులు దుర్గం రాజేశ్, అన్నపూర్ణ మురళీగౌడ్, స్వామి, ఉబెదుల్లా తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, మాజీ ఎంపీటీసీ బొంగు నర్సింగరావు, నాయకులు మోడెం సుదర్శన్‌గౌడ్, మోడెం చిరంజీవిగౌడ్, జమ్మి, గోగర్ల రాజేశ్, ఉమేశ్‌గౌడ్, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు. బెజ్జూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి హెచ్ఎం సునీత, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనాథ్, శ్రీనివాస్, యాఖూబ్, సమ్మయ్య, సంతోష్, జమీల్, కపిల్, ఆశాజ్యోతి, సంతోష్, పుణేశ్, నాయకులు జావీద్ అలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు. వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)ఆధ్వర్యంలో నేతాజీ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రయ్య, కళాశాల ఉపన్యాసకులు సురేంద్ర కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్ కుమార్, తిరుపతి, సత్యం, సంతోష్, శ్రీకాంత్, అశ్విని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆఫీసులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సత్యనారాయణ, కలికోట రమణయ్య, వాహబ్, మసూద్ అలీ, సాయి, పాషా, అజాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్ : సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదే

కళాశాలలో టీజీజేఎల్ఏ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన, జనవరి 23 : ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం టీజీజేఎల్ఏ క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్ విద్య అత్యంత కీలకమన్నారు. ఈ దశలో విద్యార్థిని సన్మార్గంలో నడిపించి, మంచిమార్గంలో వెళ్లేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఆదివాసీ జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేదుకు కోసం అధ్యాపకులు ఎళ్లవేళలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రకాశ్, మహిళా కార్యదర్శి సంధ్యారాణి, సంఘం సభ్యులు అమరేందర్, మంజుల, వెంకటేశ్వరి, శారద, రామారావు, మల్లీశ్వరి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా మట్టి రోడ్లు

- రెబ్బెన జడ్పీటీసీ సంతోష్

రెబ్బెనలో మట్టి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ వేమూర్ల సంతోష్

రెబ్బెన, జనవరి 23 : చేలు, పొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందుల్లేకుండా ఉపాధి హామీలో భాగంగా మట్టి రోడ్లు వేస్తున్నటుల రెబ్బెన జడ్పీటీసీ వేమూర్ల సంతోష్ తెలిపారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలో మంగళవారం పనులు ప్రారంభమవగా, రెబ్బెనలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరి మధునయ్య, ఈజీఎస్ ఏపీవో బుచ్చన్న, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ తుకారంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ రావ్ మృతి తీరనిలోటు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 23 : ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన విద్యావేత్త, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ అప్పల మనోహర్ రావ్ మృతి విద్యారంగానికి తీరని లోటని బుల్లి తెర సినీ దర్శకుడు, నంది అవార్డు గ్రహీత, నవజ్యోతి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు దండ నాయకుల సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో మంగళవారం అప్పల మనోహర్ రావ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి సాయిని రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ, చారి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సునీల్ అరుణ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

- ఫిబ్రవరి 14 వరకు అవగాహన కార్యక్రమాలు
- జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్య

అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన విద్యార్థులతో అధికారులు

మంచిర్యాల ఏసీసీ, జనవరి 23 : రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మంచిర్యాల జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్య అన్నారు. ఎంవీఐ రాహుల్, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్‌తో కలిసి మంగళవారం జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వీరంతా ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు రవాణా శాఖ నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. ప్రతి రోజూ ఎంపిక చేసిన పాఠశాలలు, కళాశాలలకు, మార్కెట్ ఏరియాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందు కోసం 18 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి కార్యాలయంలో పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించే సూచిక బోర్డులు గల పుస్తకాలను విద్యార్థులకు అందించినట్లు వారు వివరించారు.

రాష్ట్రపతిని అవమానించడం సరికాదు

కాసిపేట, జనవరి 23 : అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ముఖ్య అతిథిగా పిలవకపోవడం అవమానించినట్లేనని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇలాంటివి రాబోయే రోజుల్లో పునరావృతమైతే మా సంఘాల ద్వారా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయిసిడం రమేశ్, తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, పెంద్రం శంకర్, చిక్రం రాందాస్, ఆడె రమేశ్, వెడ్మ కిరణ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

బెజ్జూర్, జనవరి 23 : బెజ్జూర్ మండల కేంద్రంలో మంగళవారం జన జాగృతి కళాజాత బృందం సభ్యులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తమ పాటల రూపంలో ఎయిడ్స్‌పై వివరించారు. ఎయిడ్స్ బాధితులతో కలిసి మెలిసి ఉండవచ్చని, వారిని సంతోషంగా ఉంచుతూ వారి జీవిత కాలాన్ని పెంచాలన్నారు. కళాజాత బృందం సభ్యులు తిరుపతి, శంకర్, గణేశ్, ప్రవళిక పాల్గొన్నారు.

కలప పట్టివేత

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 23 : మండలంలోని బాబాపూర్ నుంచి టాటా మ్యాజిక్‌లో 2 కలప దుంగలను అక్రమంగా తరలిస్తుండంగా మంగళవారం పట్టుకున్నట్లు రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. సెక్షన్ అధికారి సాయిచరణ్ తన బృందంతో కలిసి తనిఖీ నిర్వహిస్తుండగా వాహనం పట్టుబడింది. వీటి విలువ సుమారు రూ.8 వేలు ఉంటుందని వివరించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. అక్రమంగా కలపను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలో బీట్ అధికారి మహేశ్ తదితరులు ఉన్నారు.

28న వాలీబాల్, కబడ్డీ పోటీలు

చింతలమానేపల్లి, జనవరి 23 : మండలంలోని బాబాసాగర్‌లో సయ్యద్ సాబీర్ హుస్సేన్ స్మారక నియోకవర్గస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొనానరు. వాలీబాల్‌లో ప్రథమ బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.7,116, అలాగే కబడ్డీలో ప్రథమ బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.7,116 అందిచనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.700 చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 63005 51088, 86886 09091, 75696 65536 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బీసీలకు రూ.50 వేల కోట్లు కేటాయించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 23 : రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో బీసీలకు 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం నాలుగు వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, బీసీ బందు పథకం ప్రవేశపెట్టాన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు 2000 కోట్లు కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో 2000 కోట్లు కేటాయించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్ 200 కోట్లు కేటాయించడంతో పాటు మెస్ చార్జీలు స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, బీసీ నాయకులు తులా మధుసూదన్, శ్రీపతి రాములు, బీ కుమార్, అంకం సతీశ్, మగిడి రాజశేఖర్ పాల్గొన్నారు.

వసతులతోనే విద్యార్థులు రాణిస్తారు

- డీఈవో పార్మి అశోక్

వైండింగ్ మిషిన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో పార్మి అశోక్, ఈసీఐఎల్ జీఎం రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 23 : విద్యార్థులకు సరైన వసతులు కల్పించిన్నప్పుడే విద్యలో రాణిస్తారనని డీఈవో పార్మి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఈసీఐఎల్ సంస్థ సౌజన్యంతో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైండింగ్ , ఇన్సినారేటర్లను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లాలోని 15 కేజీబీవీల్లో ఈసీఐఎల్ సంస్థ వైండింగ్, ఇన్సినాలేటర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకున్నప్పుడే చదువులో రాణించగలరన్నారు. అనంతరం విద్యార్థినులకు న్యాప్కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేశ్, దుర్గాప్రసాద్, చౌహాన్, సమగ్ర శిక్షణ జెండర్ కో ఆర్డినేటర్ సుభాష్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి పఠనా పోటీ..

విద్యార్థుల్లో పఠనా సంస్కృతిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖ, రూం టూ రీడ్ సహకారంతో బుధవారం తెలుగు భాషలో జిల్లాస్థాయి పఠనా పోటీ నిర్వహించనున్నట్లు డీఈవో పార్మి అశోక్ తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్‌స్థాయిలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్‌కు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయి మొదటి ముగుగురు రీడర్లకు మెరిట్ సర్టిఫికెట్, పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కేజీబీవీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్, జనవరి 23 : పౌష్టికాహారంతోనే విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి నేహా తస్లిం అన్నారు. భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్య, వైద్యశాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన విద్య నేర్చుకోవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో గంగా సింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియా, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఎల్టి నాగరాజు, హెచ్ఎస్ ధర్మారావు, ఆర్బీఎస్‌కే బృందం, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విద్యార్థులతో కలిసి విజయకేతనం చూపిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రిన్సిపాల్

కాసిపేట, జనవరి 23 : విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, అందుకు చదువు ఒక్కటే మార్గమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దివేణి అర్జున్ పేర్కొన్నారు. మంగళవారం కాసిపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య అధ్యక్షతన పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దివేణి అర్జున్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకొని నిరంతరం కృషి చేస్తే జీవితంలో తప్పకుండా విజయం సాధించవచ్చన్నారు. సాధించాలనే తపన, సంకల్పం, అంకిత భావం, క్రమ శిక్షణ సూత్రాలను పాటించాలని వివరించారు. విజయం సాధించిన పలువురి సక్సెస్ స్టోరీలను వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, చిన్న భీమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

మంచిర్యాల అర్బన్, జనవరి 23 : జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఉపన్యాస పోటీలో శివరంజని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మంచిర్యాల మొదటి బహుమతి, డీ హాసిత చిన్ని పబ్లిక్ స్కూల్ చెన్నూర్ ద్వితీయ బహుమతి, ఆదిబా సాహెర్ స్లేట్ హై స్కూల్ జన్నారం తృతీయ బహుమతి పొందారు. వ్యాసరచన అంశంలో గెడ్డం సందేశ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ ప్రథమ బహుమతి, గుండా వైష్ణవి సెవెన్ హిల్స్ హై స్కూల్ మంచిర్యాల ద్వితీయ బహుమతి, ఎం హారిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుశ్నపల్లి తృతీయ బహుమతి సాదించింది. ఈ పోటీలను సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు దరి, రాజ్ కుమార్, సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శ్రీమతి రాజేశ్వరి, శ్రీ రాజన్న, నరసింహులు వ్యవహరించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను డీఈవో యాదయ్య అభినందించారు.